## క్లుప్తంగా

### 'నేడు గడప గడపకు మన ప్రభుత్వం'

పెండ్లిమర్రి : మండలంలోని మాచునూరు గ్రామ సచివాలయం పరిధిలోని మాచునూరు, మాచునూరు దళితవాడ, కొత్తపేట గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ చంద్రారెడ్డి, ఎంపీడీఓ అల్తాఫ్‌ హుస్సేన్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్‌ క్లీనిక్‌లు ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది హాజరు కావాలని వారు కోరారు.

### నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : స్థానిక వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో సోమవారం జరిగే కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరుకానున్నారని పార్టీ మండల కన్వీనర్‌ ఉత్తమారెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్‌ కౌన్సిలర్లు, కో ఆప్షన్‌ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు హాజరుకావాలన్నారు.

### రేపు మండల సర్వసభ్య సమావేశం

వేముల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో మంగళవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఆయన తెలుపుతూ మండల సర్వసభ్య సమావేశానికి మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

### పరామర్శ

ఎర్రగుంట్ల : మండలంలోని తుమ్మలపల్లి, ఎర్రగుంట్ల ప్రాంతాలలో పలువురు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్‌ ఎం.సుధీర్‌రెడ్డి ఆదివారం మృతుల ఇళ్ల వద్దకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఎర్రగుంట్ల పట్టణం వెంపల్లి రోడ్డులో మృతిచెందిన వారి కుటుంబ సభ్యుల ఇళ్ల వద్దకు మున్సిపల్‌ చైర్మన్‌ హర్షవర్ధన్‌రెడ్డి వెళ్లి పరామర్శించారు.

### ఘనంగా ఆరాధన కార్యక్రమం

జమ్మలమడుగు రూరల్‌ (మైలవరం) : మైలవరం మండలం వద్దిరాల విశ్వాస గృహంలో ఆదివారం జరిగిన ఆరాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దైవ సేవకులు బోనం ప్రభుదాస్‌ వర్తమానాన్ని అందించారు. కొందరు దేవునితోనే అబద్ధాలు చెబుతూ ఆక్రమాలు చేస్తుంటారని అందుకు తగిన ప్రతిఫలాన్ని వారు తప్పక అనుభవించి తీరుతారన్నారు. కార్యక్రమంలో సంఘపెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

### 'స్పందన'ను సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు : స్పందన కార్యక్రమాన్ని మూడు నాలుగు వార్డులకు సంబంధించిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సచివాలయ అధికారి జాఫర్‌ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రామిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న సచివాలయం ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రతి రోజు సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. టీచర్స్‌కాలనీ, లక్ష్మీనగర్‌ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రేషన్‌ కార్డు, నవరత్నాలు, వృద్ధాప్య పెన్షన్‌ తదితర వాటిపై ఎమైన సమస్యలుంటే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### ఆసుపత్రికి వెళ్లి పెన్షన్‌ అందజేత



శ్రీనివాసరెడ్డికి పెన్షన్‌ అందజేస్తున్న వలంటీర్‌ కిరణ్‌కుమార్‌రెడ్డి

కొండాపురం : మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామ సచివాలయ పరిధిలోని ఉప్పులూరు శ్రీనివాసులరెడ్డి అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్‌ కిరణ్‌కుమార్‌రెడ్డి చికిత్స పొందుతున్న శ్రీనివాసులరెడ్డికి పెన్షన్‌ను అందజేసినట్లు తెలిపారు.

### వైభవంగా ప్రారంభమైన మహోత్సవాలు

బద్వేలు అర్బన్‌ : మండలంలోని అనంతపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో గల శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సంప్రోక్షణ, కలశస్థాపన, కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో నూతనంగా నిర్మించిన శ్రీవారి విమాన గోపురం, రాజగోపురం కుంభాభిషేక మహోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం గోపూజ, యాగశాల ప్రవేశం, విశ్వక్సేన ఆరాధన, రక్షాబంధనము, అంకురార్పణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌ మెంటా అశోక్‌కుమార్‌, దేవాదాయశాఖ కార్య నిర్వహణాధికారి సి.శివయ్య, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్‌



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ వినోద్‌కుమార్‌

వేంపల్లె : పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పెండింగ్‌ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని డీఎస్పీ వినోద్‌కుమార్‌ సూచించారు. ఆదివారం వేంపల్లెలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అలాగే పెండింగ్‌ కేసుల వివరాలను తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సీఐకి సూచించారు. పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో పచ్చదనాన్ని పెంపొందించాలని, శుభ్రత పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణే పోలీసుల ఏకైక కర్తవ్యమని, ప్రజల భద్రత, భరోసా కల్పిస్తూ విజువల్‌ పోలీసింగ్‌, నేరపూరిత కార్యక్రమాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్‌ నిబంధులు పాటిస్తూ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు తమ వెంట ఉంచుకోవాలన్నారు. లేనిపక్షంలో జరిమానాతోపాటు వాహనాన్ని సీజ్‌ చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ తిరుపాల్‌ నాయక్‌, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి**

పర్యావరణ సమతుల్యతకు మొక్కలు నాటడంతో పాటు వాటిని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని డీఎస్పీ కె.ఎస్‌.వినోద్‌కుమార్‌ తెలిపారు. ఆదివారం స్థానిక రాజీవ్‌నగర్‌ కాలనీలోని మదర్‌ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో డీఎస్పీ మొక్కలు నాటి నీటిని పోశారు. అలాగే వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అనాథలపట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని.. వారికి అండగా నిలవాలని చేయూతనందించాలని పిలుపునిచ్చారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ తిరుపాల్‌ నాయక్‌, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్‌ చక్రపాణిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయంలో కథలు చెప్పిన విద్యార్థులు



కథలు చెబుతున్న విద్యార్థిని

పులివెందుల టౌన్‌ : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో సమ్మర్‌ క్యాంపులో భాగంగా ఆదివారం విద్యార్థులు కథలు చెప్పడం, పద్యాలు చెప్పడం, చిత్రలేఖనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు వారు నేర్చుకున్న కథలను చదివి వినిపించారు. అనంతరం విద్యార్థులకు సమోసాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్‌ కృష్ణకిశోర్‌రెడ్డి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

**సృజనాత్మకతను పెంపొందించుకోవాలి**

కమలాపురం : విద్యార్థులు డ్రాయింగ్‌, వ్యాసరచన, వకృత్వ తదితర అంశాల్లో సృజనాత్మకతను పెంపొందించుకోవాలని కమలాపురం శాఖ గ్రంథాలయాధికారిణి నాగాంజలి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు డ్రాయింగ్‌ వేయడంలో శిక్షణ నిచ్చారు. అనంతరం పుస్తక పఠనం, స్పోకెన్‌ ఇంగ్లీష్‌, కథల పుస్తకాలు చదవడం, నీతి కథలు చదవడంలో మెలకువలు నేర్పించారు. చెస్‌, క్యారమ్స్‌, లూడో లాంటి మేధస్సు పెంచే క్రీడలను ఆడించారు.

**గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపొందించుకోవాలి**

కొండాపురం : గ్రాంథాలయాలను పిల్లలు సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ సిబ్బంది వరలక్ష్మి తెలిపారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో పిల్లలకు నీతికథలు, స్పోకన్‌ ఇంగ్లీష్‌పై ప్రత్యేక బోధన విశ్రాంత ఉపాధాయుడు గోపాల్‌రెడ్డి బోధించారు. పిల్లలకు క్యారమ్స్‌, లూడో చెస్సు ఆటలను నేర్పించామన్నారు.

**ఇంగ్లీష్‌ గ్రామర్‌పై తరగతులు**

సింహాద్రిపురం : స్థానిక గ్రంథాలయంలో సమ్మర్‌ క్యాంపులో భాగంగా ఆదివారం విద్యార్థులకు బ్రాంచ్‌ పోస్ట్‌ మాస్టర్‌ వెంకటేశ్వరరెడ్డి ఇంగ్లీష్‌ గ్రామర్‌పై తరగతులు తీసుకున్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్‌ శేఖర్‌, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా భీమేశ్వరస్వామి తిరునాల



సీకేదిన్నెలో ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

పెండ్లిమర్రి : మండలంలోని వేలూరుపాడు గ్రామసమీపంలో వెలసిన భీమేశ్వరస్వామి తిరునాల ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి గణపతి పూజ, అభిషేకాలకరణ, పంచామృతాభిషేకం, ఆకుపూజ వంటి ప్రత్యేక కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. శివ పార్వతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బండలాగుడు పోటీలు నిర్వహించి ఎద్దుల యాజమానులకు బహుమతులు అందజేశారు.

**అచ్చివెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు**

పులివెందుల రూరల్‌ : మండల పరిధిలోని అచ్చివెళ్లి గ్రామ సమీపంలో వెలసిన అచ్చివెళ్లి గంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మ తల్లిగా అచ్చివెళ్లి గంగమ్మ ఎంతో ప్రసిద్ధి గాంచింది. కడప, కర్నూలు, అనంతపురం తదితర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. ఆలయ అర్చకులు ప్రసాదాలను భక్తులకు అందజేశారు.

**భక్తి శ్రద్ధలతో పౌర్ణమి వేడుకలు**

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లెలో వెలసిన శ్రీశివకృష్ణ గోశాల, ఎన్‌.పాలగిరి క్రాస్‌ వద్ద వెలసిన అవధూత కాశిరెడ్డినాయన అలయం, సాయిబాబా ఆలయాల్లో ఆదివారం పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు నిర్వహించారు. కాశినాయన ఆలయంలో ఏర్పాటు చేసిన తాళాల భజన కార్యక్రమం భక్తులను అలరించింది. గోశాలలో గోమాతలను అలంకరించి పూజలు నిర్వమించారు. అనంతరం గీతాపారాయణం, భాగవత పఠనం కార్యక్రమం చేట్టారు. భక్తులకు కాశినాయన ఆలయ దర్మకర్త పుల్లారెడ్డి, గోశాల నిర్వాహకుడు రాజశేఖర్‌రెడ్డి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

**గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు**

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు.

ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్‌ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో విందుభోజనాలు చేశారు. అలాగే ఆలయ సమీపంలోని ఆంజనేయస్వామి, సాయిబాబా, వైద్యనాథేశ్వరుడు, అక్కదేవతలు, వీరభద్రుడు, నవగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**చిన్నదండ్లూరులో పౌర్ణమి పూజలు**

ఎర్రగుంట్ల : చిన్నదండ్లూరు గ్రామంలోని ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆదివారం వేద పండితుల చేతుల మీదుగా భూమాతను, వృషభరాశులను పూజించి దుక్కిదున్నే కార్యక్రమాన్ని జేడీ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించామని పసువుల వెంకటమ్మ చారిటబుల్‌ ట్రస్టు ఫౌండర్‌ అండ్‌ చైర్మన్‌ పసువుల సుబ్బరాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం రైతులను సన్మానించారు.

# ఘనంగా ఉరుసు మహోత్సవం



ఖవ్వాలి పోటీలు జరుగుతున్న దృశ్యం

జమ్మలమడుగు : పట్టణంలోని పలగాడి వీధిలో వెలసిన తూగుట్లపల్లి జాగీర్దార్‌ హజరత్‌ సయ్యద్‌షా బడేగౌస్‌పీరా ఖాద్రీ 91వ ఉరుసు మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉరుసు సందర్భంగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు గ్వాలియర్‌కు చెందిన సలీమ్‌జంకార్‌ అండ్‌ పార్టీ బెల్గాంకు చెందిన మొషిన్‌చిస్తిలతో గొప్ప ఖవ్వాలి పోటీలను నిర్వహించారు. సాయంత్రం ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌ షా గౌస్‌పీరాఖాద్రీ ఆధ్వర్యంలో ఖురాన్‌ ఖ్వాని నిర్వహించి ఉరుసు మహోత్సవానికి ముగింపు పలికారు. కార్యక్రమంలో సయ్యద్‌షా నిజాముద్దీన్‌ అవులియా ఖాద్రీ, సయ్యద్‌షా మహమ్మద్‌ తాహీర్‌పీరాఖాద్రీ, సయ్యద్‌ షా భక్తియార్‌ ఖాద్రీ, కమిటీ సభ్యులు మహమ్మద్‌ గౌస్‌, జహంగీర్‌బాషా, రజాక్‌ పీర్‌ పాల్గొన్నారు.

## 'వేమన'కు మరింత ఉన్నతాసనం



విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఎత్తు చేస్తున్న దృశ్యం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం నూతన ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన యోగివేమన విగ్రహానికి మరింత ఉన్నతస్థానాన్ని కల్పించేందుకు విశ్వవిద్యాలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. న్యాక్‌ సమయంలో విశ్వవిద్యాలయ ముఖద్వారం వద్ద హడావుడిగా వేమన విగ్రహం ఏర్పాటు చేశారు. అయితే వేమన విగ్రహాన్ని తక్కువ ఎత్తులో ఏర్పాటు చేశారంటూ పలు విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు విశ్వవిద్యాలయ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ క్రమంలో వేమన విగ్రహాన్ని మరింత ఎత్తులో నిర్మించేందుకు వైవీయూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం తక్కువ ఎత్తులో ఉన్న వేమన విగ్రహాన్ని తీసి పక్కన ఉంచి, ఏర్పాటు చేయనున్న ఆసనం ఎత్తు పెంపు పనులు ప్రారంభించారు. వారంరోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి మరింత స్పష్టంగా కనిపించేలా ప్రత్యేక డిజైన్‌తో వేమన విగ్రహాన్ని తిరిగి పునఃప్రతిష్ట చేసేందుకు వైవీయూ అధికారులు చర్యలు చేపట్టారు.



# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

లింగాల : మండలంలోని వెలిదండ్ల జిల్లా పరిషత్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1983 బ్యాచ్‌ పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు.

పార్నపల్లె చిత్రావతి బ్యాలెన్సింగ్‌ రిజర్వాయర్‌ సమీపంలోని వైఎస్సార్‌ లేక్‌ వ్యూ రెస్టారెంట్‌లో ఆ బ్యాచ్‌కు చెందిన సుమారు 70 మంది పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించి ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులైన వెలిదండ్ల గ్రామ సర్పంచ్‌ మల్లికార్జునరెడ్డి, తాతిరెడ్డిపల్లె సర్పంచ్‌ మల్లికేశ్వర రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫీజుల దోపిడీని అరికట్టాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: జిల్లాలోని కార్పొరేట్‌, ప్రైవేట్‌ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్‌, ప్రైవేట్‌ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు జీఓ నెంబర్‌ 1,42 అమలు చేయాలన్నారు. జిల్లాలో కార్పొరేట్‌ విద్యా సంస్థలు పీఆర్వోలను పెట్టుకొని గత సంవత్సరం డిసెంబర్‌ నుంచి అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని తెలిపారు. ప్రైవేట్‌ పాఠశాలలో 25 శాతం నిర్బంధ విద్యను అమలు చేయాలన్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తులు చేసుకోండి

పులివెందుల రూరల్‌ : పట్టణంలోని రింగ్‌ రోడ్డు సమీపంలో ఉన్న న్యాక్‌ కార్యాలయంలో ఉచిత శిక్షణ కోసం ప్రతి యువకుడు దరఖాస్తులు చేసుకోవాలని న్యాక్‌ ఇన్‌చార్జి రాకేష్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. న్యాక్‌ కన్‌స్ట్రక్షన్‌ ఏపీఎస్‌, ఎస్‌డీఎస్‌ వారి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా 60 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సర్వేయర్‌ ఎలక్ట్రిషియన్‌, అసిస్టెంట్‌ టెక్నిషియన్‌, ఎయిర్‌ కండిషనర్‌, కుట్టు మిషన్‌, ఫ్యాషన్‌ డిజైనర్‌, టూవీలర్‌ మెకానిక్‌లకు సంబంధించి శిక్షణ ఇచ్చి రాష్ట్రంలోని పలు ప్రైవేట్‌ కంపెనీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అక్రమాలపై విచారణ చేపట్టాలి

వేంపల్లె : స్థానిక గ్రామ పంచాయతీలో చోటు చేసుకున్న అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం వేంపల్లెలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పంచాయతీ ఈఓగా బాధ్యతలు చేపట్టి 11 నెలలు గడుస్తున్నా ఇంతవరకు పంచాయతీ పాలక మండలి సమావేశం నిర్వహించకపోవడం దారుణమన్నారు. వేంపల్లెలో రోడ్ల విస్తరణ జరుగుతుందన్న నెపంతో ప్రధాన రోడ్లపై ఏనాడూ కనీసం శుభ్రత కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. ప్రజలచేత ముక్కు పిండి పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ మౌలిక వసతులు కల్పించడంలో లేదన్నారు. వేంపల్లె గ్రామ పంచాయతీలో అనేక సమస్యలు ఉన్నా.. వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సునీల్‌కుమార్‌, సుష్మా, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు



శాస్త్రీయ నృత్యంలో చిన్నారులు

పులివెందుల టౌన్‌ : పట్టణంలోని స్థానిక శిల్పారామంలో సమ్మర్‌ క్యాంపు ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం రాజా కళా నిలయం మాస్టర్‌ రాజా ఆధ్వర్యంలో చిన్నారుల జానపద, శాస్త్రీయ, వెస్టర్న్‌ నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలో చిన్నారుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో శిల్పారామ ఏఓ సుధాకర్‌, సేవా సమితి అధ్యక్షుడు రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి మహా కుంభాభిషేక ప్రతిష్ట వేడుకలు

పులివెందుల టౌన్‌ : ముద్దనూరు రోడ్డు సమీపంలోని వాసవీ కాలనీలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ రాజగోపుర ప్రతిష్ట, మహా కుంభాభిషేక ప్రతిష్ట వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఋగోపాలాచార్యులు తెలిపారు. ఈ ప్రతిష్టకు మున్సిపల్‌ ఇన్‌చార్జి వైఎస్‌ మనోహర్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్మన్‌ వరప్రసాద్‌, సివిల్‌ సప్లయ్‌ రాష్ట్ర డైరెక్టర్‌ హాలు గంగాధరరెడ్డిలు హాజరవుతారన్నారు. 6వ తేదీ నుంచి 9వ తేదీవరకు తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్‌ మిట్టా శ్రీహరి, అధ్యక్షుడు పుల్లగూర సుధాకర్‌, కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి మనోహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు పయనం



జాతీయస్థాయి పోటీలకు పయనమైన ఏపీ తైక్వాండో బాలికల జట్టు

కడప స్పోర్ట్స్‌: స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 12వ తేదీ వరకు ఢిల్లీలోని ఛత్రసాల్‌ స్టేడియంలో నిర్వహించనున్న అండర్‌–19 తైక్వాండో చాంపియన్‌షిప్‌ పోటీలకు ఏపీ అండర్‌–19 బాలికల జట్టు రైల్వేకోడూరు నుంచి పయనమైంది. ఈ సందర్భంగా ఉమ్మడి వైఎస్‌ఆర్‌ కడప జిల్లా ఎస్‌జీఎఫ్‌ అండర్‌–19 కార్యదర్శి సి. శారద మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులు జాతీయస్థాయిలో రాణించి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. విశ్రాంత ఫిజికల్‌ డైరెక్టర్‌ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల సందడి



కడప కల్చరల్‌ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక దేవ డ్యాన్స్‌ అకాడమి విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.



## భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం

కడప కల్చరల్‌ : తిరుమల–తిరుపతి దేవస్థానాల అనుబంధ సంస్థ హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ చేపట్టిన ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకుని కడప నగరం గడ్డిబజారు శ్రీ లక్ష్మి సత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణవ్రతం నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని ప్రతి జిల్లాలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా టీటీడీ వేదిక్‌ యూనివర్శిటీ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌, ఆగమశాస్త్ర పండితులు రాజేష్‌భట్టర్‌, ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్‌ పూజాధికాలు నిర్వహించారు. ఇతర అర్చక బృందంతో కలిసి వారు మంత్రోచ్చాటనల మధ్య స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పంచద్రవ్యాలు, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం పుష్పాలు, సువర్ణ ఆభరణాలతో దేవతామూర్తులను కనుల పండువగా అలంకరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన భక్తులతో వారు శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహింపజేశారు. ధర్మ ప్రచార పరిషత్‌ ప్రోగామ్‌ అసిస్టెంట్‌ టి.గోపిబాబు, శ్రీవారి సేవకులు రామమహేష్‌ పాల్గొన్నాయి.

**నేడు శ్రీ సత్యదేవుని కల్యాణోత్సవం**

కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 6.30 గంటలకు శ్రీ లక్ష్మినారాయణ సుదర్శన హోమం, 9.00 గంటలకు మహాపూర్ణాహుతి నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్‌ తెలిపారు. అలాగే 10.30 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం ఉంటుందని వివరించారు. మధ్యాహ్నం 12.00 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.